COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
M.B.BHAVAN, 1-1-60/2,RTC X ROADS, HYDERABAD -20,
☎ 040-27665011, 27665012, Fax: 040- 27601001
E-mail: email@cpimap.org

**ప్రచురణార్థం:** **తేది:19.02.2012**

## 28న బంద్‌ను, సమ్మెనూ జయప్రదం చేయండి
## ప్రజానీకానికి వామపక్షాల పిలుపు

సార్వత్రిక సమ్మె నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగ్రహాన్ని, నిరసననూ వ్యక్తం చేసేందుకు మంచి అవకాశం దొరికిందని వామపక్షాలు పేర్కొన్నాయి. అందుకే ఈనెల 28న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను, దానికి సంఘీభావంగా జరిగే రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చాయి. తద్వారా పాలకుల విధానాలను తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశాయి.

ఈనెల 28న వామపక్షాల ఆధ్వర్యాన నిర్వహించే రాష్ట్ర బంద్ పోస్టర్‌ను విడుదల చేసేందుకు ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, మురహరి (ఎస్‌యుసిఐసి), శ్రీనివాసరావు (ఫార్వర్డ్‌బ్లాక్), తాంద్రకుమార్ (ఎంసిపిఐయు), జానకిరాములు (ఆరెస్పీ) సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కేంద్ర కార్మికసంఘాలన్నీ కలిసి ఈనెల 28న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని అన్నారు. ట్రేడ్ యూనియన్లు నిర్వహించతలపెట్టిన ఈ సమ్మెకు వామపక్ష పార్టీలు పూర్తి సంఘీభావాన్ని, మద్దతును తెలిపాయని గుర్తు చేశారు. సమ్మెను జయప్రదం చేసేందుకు ఈనెల 28న రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. ఇప్పటికే వివిధ కార్మిక సంఘాలు కంపెనీలు, ఫ్యాక్టరీల యాజమాన్యాలకు సమ్మె నోటీసును అందజేశాయని తెలిపారు. కార్మిక సంఘాలు ప్రతిపాదించిన డిమాండ్లతోపాటు రాష్ట్రంలోని వివిధ తరగతుల ప్రజానీకం ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వరంగ సంస్థలు, శాఖల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సమ్మెలు, ఆందోళనలూ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అనేకానేక సమస్యలు తిష్టవేసిన నేపథ్యంలో వాటన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు తమ నిరసన గళాన్ని విప్పాలని రాఘవులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించతలపెట్టిన సమ్మెకు, వామపక్షాల పిలుపు మేరకు జరగబోయే రాష్ట్రబంద్‌కు మద్దతునివ్వాలని కాంగ్రెస్, టిడిపి, బిజెపి, టిఆర్ఎస్ తదితర పార్టీలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న హోం గార్డుల్లో చాలా మందిని ఈ మధ్య తొలగించారని చెప్పారు. అనేకానేక పైరవీలు చేస్తేనే వారిని మళ్లీ విధుల్లోకి తీసుకుంటున్నారని చెప్పారు. కార్మికులు, ఉద్యోగులపట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాలను పున:పరిశీలించాలని ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా నారాయణ సూచించారు. లేదంటే వామపక్షాల ఆధ్వర్యాన ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు.

**(జె జయరాం)**
ఆఫీసు కార్యదర్శి